క్లుప్తంగా

సమస్యలు పరిష్కరిస్తాం..

పినపాక: ఎల్చిరెడ్డిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో డైలీ వర్కర్ల సమస్యలు పరిష్కరించి వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో చెత్తను పంచాయతీ సిబ్బందితో తొలగించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి చెత్తను సేకరించి, పరిసరాలకు బ్లీచింగ్ పిచికారీ చేశారు. అనంతరం సీపీఎం మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న కార్మికుల తరఫున అధికారులతో మాట్లాడారు. డైలీ వర్కర్లకు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, పాఠశాల హెచ్ఎం త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మద్దతు ఇవ్వండి

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల సమయంలో హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నమ్మవద్దని, ప్రజల పక్షాన పోరాడే సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కెచ్చల రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కావడిగుండ్ల గ్రామంలో మాజీ ఎంపీటీసీ వాసం బుచ్చిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల తర్వాత పార్టీలు మారుతున్న నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు గోగినపల్లి ప్రభాకర్, కంగాల కల్లయ్య, బాడిస లక్ష్మణ్‌రావు, కంగాల భూలక్ష్మి, గొంది లక్ష్మణ్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆయా మృతి

పినపాక: కిడ్నీ వ్యాధితో అంగన్‌వాడీ ఆయా మృతి చెందిన ఘటన పినపాక మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మణుగూరు ప్రాజెక్ట్ పినపాక సెక్టార్ గడ్డంపల్లి-1 అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న హెల్పర్ పాపం బుల్లెమ్మ గతకొన్న రోజులుగా జ్వరం, కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సీడీపీఓ జయలక్ష్మి, సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ టీచర్లు సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నిఖిత హాస్పటల్ ఎదురుగా ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టడంతో పట్టణానికి చెందిన సాయిబాబుకి తీవ్ర గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో వారు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో ముక్కులో నుంచి రక్తస్రావం అవ్వడంతో సాయిబాబు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో సీఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

సముచిత స్థానం కల్పించాలి

భద్రాచలంటౌన్: ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందరన్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇన్‌చార్జ్ పొద్దుటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికలతో పాటు దేవాదయ శాఖ, ఇతర ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో ఆర్యవైశ్యులకు ప్రాముఖ్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు చారుగుళ్ల శ్రీనివాస్, బండారు కృష్ణయ్య, ఉడతా నగేష్ కుమార్, రేపాకహరి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓగా సారయ్య

ములకలపల్లి: ములకలపల్లి సొసైటీ (పీఏసీఎస్) సీఈఓగా పండ్ల సారయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లూ ఇక్కడ సీఈఓగా విధులు నిర్వహించిన కుంచారపు శ్రీనివస రావు గుంపెన పీఏసీఎస్‌కు బదిలీకాగా.. కొత్తగూడెం సొసైటీ సీఈఓగా పనిచేసిన సారయ్య ఇక్కడకు వచ్చారు. కాగా ఇరువురు సీఈఓలను పీఏసీఎస్ చైరపర్సన్ నడపల్లి సుందన దుశ్శాలువతో సత్కరించారు. నడిపల్లి నవీన్‌కుమార్, నరాటి ప్రసాద్, ముదిగొండ రాంబాబు, లలితారావు, నాగేశ్వర రావు, పలువురు డైరెక్టర్లు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల నిరసన

భద్రాచలంటౌన్: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. డివిజన్ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లగుండ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. బందు వెంకటేశ్వరరావు, విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, నిర్మలానందం, నాయుడు రామారావు, అజయ్, మురళీకృష్ణ, పి.కోటేశ్వరరావు, సుబ్బయ్య చౌదరి, పంపన సత్యనారాయణ, ఎస్ రాజబాబు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

- సారపాక- బూర్గంపాడు రోడ్డంతా గోతులు
- తరచు చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- ప్రాణాలు పోతున్నా పట్టింపు లేని అధికారులు



గోతులతో అధ్వానంగా మారిన బూర్గంపాడు-సారపాక రహదారి



ప్రమాదాలకు నెలవైన సారపాక- రెడ్డిపాలెం మూలమలుపు

బూర్గంపాడు: బూర్గంపాడు-సారపాక మధ్యన ఆర్ అండ్‌బీ రహదారిలో మూడు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు తీవ్రంగా గాయపడుతున్నారు. కొన్ని ఘటనలలో ప్రాణాలు కొల్పోయినవారు ఉన్నారు. ఈ మూలమలుపుల వద్ద సైన్‌బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు నామమాత్రమే. ప్రమాదకర మలుపుల వద్ద సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరదలతో రహదారి విధ్వంసం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భద్రాచలం వచ్చే వాహనాల్లో 70శాతం బూర్గంపాడు మీదుగా సారపాక నుంచి వెళ్తాయి. అయితే ఈ రాష్ట్రీయ రహదారి 2022 గోదావరి వరదల సమయంలో పూర్తిగా దెబ్బతింది. నాటి నుంచి నేటి వరకు ఈ రహదారిని పట్టించుకున్న నాథుడే లేడు.

మృత్యుకూపంగా మూడు మలుపులు

బూర్గంపాడు ప్రధానకూడలిలోని మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించవు. ఎల్ షేప్ మూలమలుపు వలన ఇక్కడ ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించకపోతే ప్రమాదాలు తప్పవు. ఈ క్రమంలోనే తరచూ ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం మూలమలుపు మరింత ప్రమాదకరంగా ఉంది. ఇది కూడా ఎల్ షేప్‌లో ఉండే మూలమలుపే. బూర్గంపాడు నుంచి సారపాక వైపు వచ్చే సమయంలో ఈ మూలమలుపు కొంత డౌన్‌గా ఉండటంతో వాహనాలు వేగంగా వస్తే అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా పటిష్ట రక్షణ చర్యలు చేపట్టలేదు. ఈ మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదాలలో గతంలో పదుల సంఖ్యలో వాహనాదారులు ప్రాణాలు పోగోట్టుకున్నారు. దీనికంటె సారపాక మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మూలుపు వద్ద ఏటా కనీసం పది రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలలో పలువురు ప్రాణాలు పోగోట్టుకున్నారు. ఆర్టీసీ బస్సు, ఆటోను ఢీకొట్టిన ఘటనలో నలుగురు మృత్యువాత పడ్డారు. రెండు లారీలు వేగంగా ఢీ కొన్న ఘటనలో డ్రైవర్లు ఇద్దరు ప్రాణాలు కొల్పోయారు. ఆర్టీసీ బస్సు, కారు ఢీ కొన్న ఘటనలో ఇరువురు మరణించారు. మోటార్ సైకిళ్లు,ఆటోలు ఢీకొన్న ఘటనలలో పలువురు తీవ్రంగా గాయపడిన ఘటనలు అనేకమున్నాయి.

> **రెండు బస్సులు ఢీ.. 32 మందికి గాయాలు**
>
> బూర్గంపాడు-సారపాక మధ్యన ఆర్అండ్‌బీ రహదారిపై రోజూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటోంది. ఇందులో భాగంగానే శుక్రవారం ఉదయం సారపాక మూలమలుపు వద్ద ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 32 మంది గాయపడ్డారు.

గుంతలమయం..

మూలమలుపులు ప్రమాదకరంగా ఉంటే దీనికి తోడు ఈ రహదారి గోతులతో ప్రయాణానికి నరక ప్రాయంగా మారింది. ఈ ఐదు కిలోమీటర్ల మేరా అడుగుకో గుంతతో రోడ్డు అధ్వానంగా తయారైంది. మూడున్నరేళ్లుగా ఈ రహదారికి కనీస మరమ్మతులు చేపట్టలేదు. గోతులలో వెట్‌మిక్స్, కంకరకు బదులుగా అప్పుడప్పుడు గ్రావెల్ పోసి ఆర్అండ్‌బీ అధికారులు కొత్త సమస్యలు సృష్టిస్తున్నారు. వర్షానికి ఈ మట్టి బురదమయంగా మారి వాహనదారులు జారిపడుతున్నారు. ఒకవేళ ఎండకాస్తే గ్రావెల్ రాకపోకలతో దుమ్ములేచి వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

పట్టింపులేని అధికారులు

ఈ రహదారికి కనీస మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహనదారులు పలుమార్లు ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం లేదు. సారపాక వద్ద పెద్ద పెద్ద గోతులలో పాత హెల్మెట్లు, పాత కూలర్లు హెచ్చరిక బోర్డులుగా పెట్టి స్థానికులు నిరసన చేపట్టినప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులలో మాత్రం ఎలాంటి చలనం లేదు. సంబంధిత అధికారులను రోడ్డు దుస్థితిపై 'సాక్షి'వివరణ అడుగగా.. వానలు తగ్గిన తరువాత రోడ్డు మరమ్మతులు చేపడతామని తెలిపారు. మూలమలుపుల వద్ద సైన్‌బోర్డులు ఉన్నాయని, మూలమలుపుల వద్ద రక్షణ చర్యలు చేపడతామన్నారు.

హెపటైటీస్-బి వ్యాక్సిన్ తప్పనిసరి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ సైదులు

భద్రాచలంటౌన్: వైద్య ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే అధికారులు, సిబ్బందితో పాటు ఆశ వర్కర్లు హెపటైటిస్-బి వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్ఓ సైదులు తెలిపారు. జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా భద్రాచలం ఏరియా ఆస్పత్రి హెల్త్ కేర్ వర్కర్లకు హెపటైటిస్-బీ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రిలో పనిముట్లు, సిరంజిలు, బెడ్లు, ఫ్లోర్ ఇతర కలుషిత వ్యర్థులను తాకినప్పుడు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని, తద్వారా సిరోసిస్ (కాలేయం పనిచేయకపోవడం)తో కాలేయ క్యాన్సర్ సోకే వీలుందని చెప్పారు. అనంతరం జిల్లా ప్రోగ్రామ్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ పుల్లారెడ్డి హెపాటైటిస్-బీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ చైతన్య, జిల్లా ప్రోగ్రాం అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పించాలి

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు గంటా శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. ములకలపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ములకలపల్లి మండలంలో ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్లలో ఎస్సీలకు ఒక్క ఎంపీటీసీ సీటు కూడా కేటాయించలేదని, ఇప్పటి వరకు ఎప్పుడూ ఎస్సీలకు జెడ్పీటీసీ స్థానం ఇవ్వలేదని వాపోయారు. మాల మహానాడు మండల నాయకులు వర్కా రుక్మాంగధర రావు, సీనియర్ నాయకులు గుమ్మడి దేవస్వామి, కాళ్ళ నాగరాజు. అడ్వకేట్ గోలి సందీప్ కుమార్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో మెరుగైన పాలన

భద్రాచలంటౌన్: ప్రతి ఒక్క పౌరుడికి మెరుగైన ప్రభుత్వ పాలన అందాలంటే సమాచార హక్కు చట్టం ద్వారా సాధ్యమవుతుందని రిటైర్డ్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటా దేవదానం అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో సమాచార హక్కు వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనులు ఐటీడీఏ పరిధిలో అందించిన అర్జీల స్థితిగతులను తెలుసుకోడానికి, కార్యాలయాలు, రికార్డులను తనిఖీ చేయడానికి సమాచారం హక్కు చట్టం ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏఓ రాంబాబు, ఎస్ఓ ఉదయభాస్కర్, ఆర్సీఓ అరుణకుమారి, ఈఈ మధుకర్, సమ్మయ్య, ఉదయ్ కుమార్, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న బీఈడీ కళాశాలల బృందం సభ్యులు

భద్రాచలంటౌన్: స్థానిక కాకతీయ యూనివర్సిటీ విద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ ఎన్.శ్రీనివాస్‌ను జిల్లాలోని బీఈడీ కళాశాలల బాధ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని యూనివర్సిటీ విద్య కళాశాలలో ఆయనను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు

దమ్మపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో.. దమ్మపేట గిరిజన సంక్షేమ గురుకులానికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. అథ్లెటిక్స్ అండర్-17 విభాగంలో మూడు బంగారు, రెండు వెండి, రెండు కాంస్య పతకాలను సాధించారు. పతకాలు గెలుపొందిన విద్యార్థుల్లో శ్రీకాంత్, మహేష్, సాయిచరణ్, అజయ్, గణేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ పూనెం వీరాస్వామి, వైస్ ప్రిన్సిపాల్ విల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు పద్దం ప్రసాద్, బుచ్చయ్య, ఉపాధ్యాయులు, తదితర సిబ్బంది అభినందించారు.



దమ్మపేట: పతకాలు గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రాధిక స్కూల్ ప్రతిభ

పినపాక: 69వ జిల్లా స్థాయి పాఠశాల క్రీడలలో రాధిక కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి చరణ్ నాయక్ ప్రతిభ కనబరిచారు. అండర్-17 విభాగంలో 3000 మీటర్ల వాక్ పోటీలలో జిల్లా తృతీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి శుక్రవారం చరణ్‌ను, పీఈటి మహేష్ లను అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు చింతకుంట జయసింహ రెడ్డి, సంపత్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సజీమన్ వర్మ, ఇన్‌చార్జ్ టీచర్లు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంతోష్ ఓ ప్రకటనలో తెలిపారు. వినాయకపురం, నారాయణపురం సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులంతా గమనించి సహకరించాలని ఆయన కోరారు.

దమ్మపేట: మండలంలోని మల్కారం సబ్ స్టేషన్ పరిధిలో నేడు (శనివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, దమ్మపేట విద్యుత్ శాఖ ఏఈ సాయికిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మల్కారం సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా ఆ పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎస్సై ఆర్థిక సాయం

కరకగూడెం: మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన కొమరం నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం ఎస్సై ఇమ్మడి రాజ్‌కుమార్ ఆ కుటుంబానికి రూ.5 వేలు వితరణ చేశారు. ఆర్థిక సాయాన్ని గ్రామస్తులకు అందించగా.. వారు శుక్రవారం మృతుడికుటుంబానికి అందజేశారు. కాగా సదరు ఎస్సై గతంలో కరకగూడెం మండలంలో విధులు నిర్వహించి, స్థానికులతో సన్నిహితంగా మమేకమై పనిచేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఏడీఈ..

చర్ల: ఎంబీబీఎస్ చదువుతున్న నిరుపేద విద్యార్థి గోరంట్ల ధన్యశ్రీకి చర్ల ట్రాన్స్‌కో సబ్ డివిజనల్ ఏడీఈ ప్రభాకరావు రూ.10 వేలను వితరణగా అందజేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆర్థిక సాయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో ఏఈ డి.వెంకటేశ్వరావు, లైన్‌మెన్ టి.విజయ్‌కుమార్, ట్రాన్స్‌కో ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నన్నపనేని మోహన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నన్నపనేని మోహన్, బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య సామగ్రిని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పంపిణీ చేశారు. పాఠశాలలోని సుమారు 250 మంది విద్యార్థులకు షూ, టై, బెల్ట్‌తో పాటు బ్యాడ్జ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజ నిర్మాణానికి కృషి



ప్రదర్శనలో మాట్లాడుతున్న మణుగూరు మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరురూరల్: మానసికంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దామని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె సూరిరెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి మాట్లాడుతూ.. మానసికంగా ప్రశాంతంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని, ఒత్తిడిని కూడా జయించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నగేష్, మండల లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు అంకం సర్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు కుర్మా విజయరావు, చిర్ర రవికుమార్, దాసరి కవిత, చిర్ర సరస్వతి, బి.సునీత, పోశం భాస్కర్, రమేష్, శ్రీవిద్య కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం అని మణుగూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, జిల్లా ఆంగ్ల రీసోర్స్ పర్సన్ షేక్ మీరాహుస్సేన్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో శుక్రవారం సమితిసింగారంలో, జెడ్పీ కోఎడ్యుకేషన్ ఉన్నత పాఠశాల ఆవరణలో మార్నింగ్ వాకర్స్, యోగా, కరాటే శిక్షణ పొందేవారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ జోన్ చైర్‌పర్సన్ ముత్తంశెట్టి నాగేశ్వరరావు, జీఎల్‌టీ కో ఆర్డినేటర్ గాజుల రమేష్‌కుమార్, జిల్లా చైర్ పర్సన్ డాక్టర్ దుస్సా సమ్మయ్య, చింతపల్లి రాంబాబు, క్లబ్ విజన్ సురేష్, కోశాధికారి కిరణ్, పీడీ అనిల్‌కుమార్, వాకర్స్ క్లబ్ సభ్యులు ముస్తఫా, యాకుబ్, కరాటే మాస్టర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

గొయ్యి పూడ్చివేత

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని సొసైటీ గోడౌన్ దగ్గర చర్ల-భద్రాచలం ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గోతిని గ్రామస్తులు, పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం పూడ్చివేశారు. ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గోతిలో ద్విచక్ర వాహన దారులు అదుపుతప్పి కిందపడుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో గ్రామస్తులు కాంక్రీట్‌తో గోతిని పూడ్చివేశారు.

రేషన్ షాపులో తనిఖీ



రేషన్ షాప్ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని రేషన్‌షాప్ నం.6ను తహసీల్దార్ అశోక్‌కుమార్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్‌షాప్ రికార్డులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ పంపిణీలో ఏమైనా ఇబ్బందులు తలెత్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకుడికి ధరల పట్టీక బోర్డు, తాగునీరు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

ఎంబీబీఎస్ విద్యార్థినులకు సన్మానం



కరకగూడెం: విద్యార్థినులు, కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

కరకగూడెం: మండల కేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యుడు మొహమ్మద్ రఫీ కుమార్తె ఆయేషా, రైతు సయ్యద్ సజ్జాద్ హుస్సేన్ కుమార్తె సమీనాలు ఈ ఏడాది ఎంబీబీఎస్ కోర్సులో ఎంపిక కావడంతో శుక్రవారం కరకగూడెం జామే మసీదు ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మైనార్టీ పెద్దల ఆధ్వర్యంలో వారివురిని సత్కారించారు. విద్యార్థినులను, వారి తండ్రులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్ సాబ్‌లు ఫిరోజ్, జాఫిరుద్దీన్, గ్రామస్తులు సయ్యద్ ఖాజాహుస్సేన్, ఫజల్ హుస్సేన్, వాహెద్, ఆరిఫ్, యాకుబ్ పాషా, అన్సార్, అన్వర్ పాల్గొన్నారు.

పోషణ వారోత్సవాలు..

దుమ్ముగూడెం: మండలంలోని కోయనర్సాపురం గ్రామపంచాయతీలోని పాయంవారిగుంపు అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలలో పోషణ వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనసూర్య మాట్లాడుతూ.. పోషక విలువలు కలిగిన ఆహారం రాగులు, జొన్నలు లాంటివి తీసుకోవడం వల్ల తల్లి బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ మెహరున్, ప్రాథమిక పాఠశాల టీచర్ వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్లు వర్స జయ, కాదులూరి వెంకటరమణ, కల్లూరి దుర్గ, గ్రామ పెద్దలు వర్స ముద్దరాజు, వర్స నాగేశ్వరరావు, పాయం చిన్నయ్య, గర్భిణులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్త కన్నాయిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ముందుగా పోషకాలతో తయారీ చేసిన చిరుధాన్యాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ముత్తమ్మ మాట్లాడారు. కావడిగుండ్ల, కొత్త కన్నాయిగూడెం పంచాయతీ పరిధిలోని గర్భిణులకు సీమంతాలు చేసి, వాయనాలను అందించారు. ఏసీడీపీఓ అలేఖ్య, సూపర్‌వైజర్ రమాదేవి, కార్యదర్శి శోభన్‌బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'బీసీలను మోసం చేసిన కాంగ్రెస్'

చర్ల: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలను ఘోరంగా మోసం చేశారని బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ ఐనవోల్ పవన్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం చర్లలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. గతంలో ఉన్న 23 శాతం రిజర్వేషన్‌ను 42కు పెంచుతున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై ఆయన డ్రామా ఆడడంతో పాటు మంత్రులతో కూడా డ్రామా ఆడించారని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఎట్టి పరిస్థితిల్లోనూ గెలవలేమని తెలిసి బీసీ రిజర్వేషన్‌పై కోర్టు కేసులు వేయించి ఎన్నికలు నిలిచిపోయేలా చేసిందని వారు ఆరోపించారు.

'బీఆర్ఎస్ చట్టమే బీసీలకు ఉరితాడు'

చర్ల: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసిన చట్టమే బీసీలకు ఉరితాడులా మారిందని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం చర్లలో ఆయన మాట్లాడారు. ఆనాడు చట్టం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో బీసీలపై ప్రేమను ఒలకబోస్తూ బీఆర్ఎస్ నేతలు ప్రకటనలు గుప్పిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీసీల వివరాలను సేకరించే సందర్భంలో కులగణను వ్యతిరేకించిన బీఆర్ఎస్.. ఇప్పుడు బీసీ జపం చేస్తుండడం సరైనదేనా అని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం సాగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనైనా బీసీ రిజర్వేషన్ సాధిస్తామని అన్నారు.

బీసీ సంఘాల ఐక్య వేదిక నిరసన



భద్రాచలంటౌన్: నిరసనలో పాల్గొన్న బీసీ ఐక్య వేదిక నాయకులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికలకు కోర్టు స్టే ఇవ్వడం, నోటిఫికేషన్ రద్దు కావడంతో బీసీ సంఘాలు భగ్గుమన్నాయి. బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పలుచోట్ల రాస్తారోకోలు, నిరసనలు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. బీసీల రాజకీయ ఎదుగుదలను అడ్డుకునే కుట్రలను సహించబోమన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్

మందుబాబులకు అడ్డాగా.. జీపీ కార్యాలయం



కార్యాలయ ఆవరణలో కుప్పలుగా పడి ఉన్న ఖాళీ మద్యం సీసాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాండ్లగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని కొద్ది నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యాలయాన్ని ప్రారంభించిన నాటి నుంచి నేటికి భవనాన్ని తెరవడం లేదు. దీంతో కార్యాలయం దగ్గర రాత్రి, పగలు తేడా లేకుండా మందు బాబులు మద్యం సేవిస్తున్నారు. మద్యం సేవించిన ఖాళీ సీసాలు ఆవరణలో కుప్పలు, కుప్పలుగా పేరుకుపోయాయి. కాగా, గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యదర్శి పర్యవేక్షణ లేకపోవడం, భవనంలోకి కార్యాలయాన్ని మార్చకపోవడంతో మందు బాబులకు కేంద్రంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై స్థానిక ఎంపీడీఓ అప్పారావును 'సాక్షి'వివరణ కోరగా.. మద్యం సేవిస్తున్న ఘటన తన దృష్టికి రాలేదని, అలాగే భవనాన్ని స్వాధీనం చేసుకోకపోవడానికి గల కారణాలను కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని తెలిపారు.